What Brought Them to Islam Telugu تلغو

# ఏ విషయం వారిని ఇస్లాంలోనికి తీసుకు వచ్చింది?

స్వచ్ఛమైన ధర్మం సిరీస్ - 8వ భాగం


మాజిద్ సులైమాన్ అర్రస్సీ

మూల పుస్తకం ఎడిటర్: ఎన్ రానీన్



సవరణ 2019

తెలుగు అనువాదం

ముహమ్మద్ కరీముల్లాహ్



*ఎవరైనా ఈ పుస్తకాన్ని ఎలాంటి మార్పులు-చేర్పులు చేయకుండా, యథాతథంగా కాపీ చేసి లేదా ముద్రించి ఉచితంగా పంపిణీ చేయవచ్చు.*



www.saaid.net/The-clear-religion/246.pdf

# విషయసూచిక


ఈ పుస్తకంలోని గౌరవప్రదమైన వచనాలు..........4

‘అల్లాహ్’ అనే పదం గురించి..........4

పరిచయం..........7

ఇస్లాం వైపు మళ్ళేలా ప్రజలను ప్రేరేపిస్తున్నది ఏమిటి?..........10

ఆమె తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం..........14

గతంలో క్రైస్తవులుగా ఉన్న కొందరు నవముస్లింలు..........26

ముస్లింగా మారడం ఎలా..........29

చివరి మాట..........35

BIBLIOGRAPHY..........36

అనుబంధము..........37

ఇస్లామీయ పదాల నిఘంటువు..........39

## ఈ పుస్తకంలోని గౌరవప్రదమైన వచనాలు

(మహోన్నతుడు): "అల్లాహ్" ప్రస్తావనకు ముందు ఉపయోగిస్తారు. అరబీలో ఇది అజ్జవజల్, అల్లాహ్ ప్రస్తావన తర్వాత ఉపయోగిస్తారు: అర్థం: ఆయన మహిమాన్వితుడు మరియు అందరి కంటే గొప్పవాడు.

(సల్లల్లాహు అలైహి వసల్లం): *ఆయనపై అల్లాహ్ యొక్క శాంతి, కరుణ వర్షించుగాక; ప్రవక్త ముహమ్మద్ ప్రస్తావన తర్వాత ఉపయోగిస్తారు.*

(అలైహిస్సలాం): *అల్లాహ్ యొక్క శాంతి వర్షించుగాక; అల్లాహ్ యొక్క దైవదూతల ప్రస్తావన తరువాత మరియు దైవదూత జిబ్రయీల్ ప్రస్తావన తరువాత దీనిని ఉపయోగిస్తారు.*

(రదియల్లాహు అన్హా): *ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం యొక్క మహిళా సహచారిణి ప్రస్తావన తరువాత దీనిని ఉపయోగిస్తారు.*

## 'అల్లాహ్' అనే పదం గురించి

ఈ పుస్తకంలో తరుచుగా దేవుడు, దైవం అనే తెలుగు పదాల్ని, అల్లాహ్ అనే పదానికి బదులుగా వాడినప్పటికీ, ఆ పదాల మధ్య చాలా భేదం ఉంది. అరబీ భాషలోని 'అల్లాహ్' అనే పదం, తెలుగులో 'దేవుడు లేదా భగవంతుడు' అని, ఇంగ్లీషులో 'గాడ్' అని తరచుగా అనువదించబడినది. అయితే, నిజానికి వాటికి భిన్నంగా 'అల్లాహ్' అనే పదానికి చాలా ఖచ్చితమైన అర్థం ఉంది. 'అల్లాహ్' అనే పదం కేవలం 'ఆరాధ్యుడిని' సూచించే అరబీ పదం మాత్రమే కాదు. బదులుగా, 'అల్లాహ్' అనే అరబీ పదం యొక్క మూలపదం అల్ ఇలాహ్, అంటే 'ఏకైక ఆరాధ్యుడు, ఏకైక దైవం' అని అర్థం. *(అల్లాహ్ అనే పదం భాషాపరంగానూ ఖచ్చితంగా దైవత్వంలో ఏకత్వాన్ని మాత్రమే సూచిస్తున్నది. అంతేగాక దైవాన్ని సూచించే ఇతర పదాలకు*

*భాషాపరంగా బహువచనం (దేవుళ్ళు), స్త్రీలింగం (దేవతలు) పదాలు ఉండగా, అల్లాహ్ అనే పదానికి అరబీ భాషలో బహువచనం గానీ, స్త్రీలింగం గానీ లేదు).* ప్రజలచే తయారు చేయబడిన 'దేవుళ్ళు, దేవతలు' లెక్కలేనంత మంది ఉన్నారు, కానీ సకల ఆరాధనలకు అర్హుడైన ఒకే ఒక్క నిజమైన ఏకైక ఆరాధ్యుడు కేవలం అల్లాహ్ మాత్రమే. 'అల్లాహ్' అనే అరబీ పదం యొక్క భాషాపరమైన అర్థం 'ఏకైక ఆరాధ్యుడు, ఆరాధింపబడే అర్హత గల సాటిలేని ఏకైకుడు'. కాబట్టి, నిజానికి ఆరాధనకు అర్హుడైన ఏకైక దైవం యొక్క అసలు పేరే అల్లాహ్, ఆయనే విశ్వం యొక్క నిజమైన సృష్టికర్త. 'అల్లాహ్' అని పలకడం ద్వారా ముస్లింలు నిజానికి, ప్రజలు తప్పుగా ఆరాధించే ప్రతి దాన్నీ తిరస్కరిస్తున్నారు, అదే సమయంలో కేవలం ఆయనకు మాత్రమే ఆరాధనను ధృవీకరిస్తున్నారు. 'అల్లాహ్' అనే పేరుతోనే ఖుర్ఆన్‌లో స్వయంగా సర్వశక్తిమంతుడైన ఏకైక ఆరాధ్యుడు స్వయంగా ప్రస్తావించుకున్నాడు మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఆయనను ప్రస్తావించారు. కాబట్టి, ఈ పుస్తకంలో, తరచుగా 'అల్లాహ్' అనే పదం ఆరాధనకు అర్హుడైన ఆ ఏకైక దైవాన్ని సూచించే పదంగా వాడబడింది.

# పరిచయం

ప్రతి వ్యక్తీ ఒక మతపరమైన వాతావరణంలో జన్మిస్తాడు, దాని ఎంపికలో అతని లేదా ఆమె ప్రమేయం ఉండదు; బాల్యం నుండి వారి కుటుంబం, సమాజం లేదా సంస్కృతి యొక్క మతం లేదా సిద్ధాంతాన్ని అనుసరించేలా చేస్తారు. నవజాత శిశువులుగా ఉన్నప్పటికీ, వారికి వారి కుటుంబం యొక్క మతం లేదా సిద్ధాంతం కేటాయించబడతాయి; చాలా దేశాల్లో, పిల్లలకు కేటాయించబడిన మతం వారి జనన ధృవీకరణ పత్రంలో కూడా నమోదు చేయబడుతుంది. వారు తమ యుక్తవయస్సుకు చేరుకునే సమయానికి, మామూలుగా వారి తల్లిదండ్రులు లేదా వారి నిర్దిష్ట సమాజం యొక్క నమ్మకాలనే అంగీకరిస్తారు. ఈ నమ్మకాలను వారు చాలా సాధారణమైనవిగా భావిస్తారు. కాబట్టి, వాటిని క్షుణ్ణంగా పరిశీలించడం మరియు అవసరమైతే మార్చడం గురించిన ఆలోచనలు వారికి అస్సలు రావు.

ఏది ఏమైనప్పటికీ, వయస్సు పెరుగుతున్న కొద్దీ, తమ జీవిత కాలంలో వివిధ ఇతర నమ్మకాలు మరియు సిద్ధాంతాలు వారి ముందుకు వస్తాయి లేదా బహిర్గత మవుతాయి. అపుడు చాలామందిలో దీర్ఘకాల విశ్వాసాలు, సంప్రదాయాలు, సిద్ధాంతాలు లేదా తాత్విక ఆలోచనలపై ప్రశ్నలు జనిస్తాయి. వారు తమ స్వంత నమ్మకాల, విశ్వాసాల ప్రామాణికతను ప్రశ్నించడం ప్రారంభిస్తారు. అయితే, ప్రతి మతం, వర్గం, సిద్ధాంతం మరియు తత్వం యొక్క అనుచరులు సత్యం ఒక్కటే అని ప్రత్యేకంగా ప్రకటించడం ఆ సత్యాన్వేషకులను తరచుగా ఒక అయోమయ స్థితిలో పడవేస్తుంది.

ఈ సమస్యకు మూడు అవకాశాలు మాత్రమే ఉన్నాయి: 1) అవన్నీ సత్యమైనవి, 2) అవన్నీ అసత్యమైనవి, లేదా 3) వాటిలో ఒక్కటి మాత్రమే సత్యమైనది మరియు మిగిలినవన్నీ అసత్యమైనవి.

మొదటి అవకాశాన్ని పరిశీలిస్తే, అన్ని మతాల మూలాధారాలు వేర్వేరుగా ఉన్నందున అవన్నీ ఏకకాలంలో సత్యమైన మతాలు కావడం అసాధ్యం మరియు అసంభవం.

మరోవైపు రెండవ అవకాశాన్ని పరిశీలిస్తే, ఏకకాలంలో అవన్నీ అసత్యమైనవి అని వాదించడం అంటే మహోన్నతుడైన అల్లాహ్, మానవజాతి కొరకు అవతరింపజేసిన ధర్మాదేశాన్ని తిరస్కరించడమే అవుతుంది. మహావివేకవంతుడైన సృష్టికర్తను విశ్వసించే వారి కొరకు ఈ ప్రతిపాదన అసంబద్ధంగా కనిపిస్తుంది.

ఇక మూడవ అవకాశం: అన్నింటి కంటే ముఖ్యం - అసలు అల్లాహ్ మానవులను ఎందుకు సృష్టించాడు మరియు వారికి సత్యమార్గాన్ని ఎందుకు వెల్లడించడు? కాబట్టి, అన్ని మతాలలో అసలు **ఏ మతం సత్యమైనది మరియు దానిని సత్యాన్వేషకుడు ఎలా తెలుసుకోగలడు?** ఈ పుస్తకం ప్రధాన అంశం ఇదే.

సత్యాన్వేషణ ప్రారంభించేటప్పుడు, ఈ క్రింది నాలుగు విషయాలను తప్పకుండా గుర్తుంచుకోవాలి:

ముందుగా, **సత్యమైన మతం ఏది?** అనే ఈ కీలకమైన ప్రశ్నకు సమాధానాన్ని కనుగొనే సామర్థ్యాన్ని మరియు తెలివిని అల్లాహ్ మనకు ప్రసాదించాడు, ఇది జీవితాన్ని మార్చివేసే నిర్ణయానికి దారితీస్తుంది కూడా:

రెండవది, అల్లాహ్, అనంత కరుణాప్రదాత. ఎలాంటి మార్గదర్శకత్వమూ ప్రసాదించకుండా మనల్ని మార్గభ్రష్టత్వంలో పడిపోయేలా విడిచిపెట్టడు. నిజానికి, ఆయన మనకు సన్మార్గాన్ని చూపడానికి దివ్యసందేశాలతో ప్రవక్తలను పంపాడు.

మూడవది, ఈ సత్యాన్వేషణకు గల అసలు కారణాన్ని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి: రాబోయే శాశ్వత జీవితం, ఈ జీవితంలో సత్యమైన మతాన్ని స్వీకరించడంపై ఆధారపడి ఉంటుంది. ఇది మన

అంతిమ ప్రేరణ కావాలి మరియు మనం పూర్తిగా సంతృప్తి చెందే వరకు సత్యాన్వేషణ చేయడానికి మన కొరకు చోదక శక్తిగా దోహద పడాలి[1].

<u>నాల్గవది</u>, వాస్తవికత పట్ల మనల్ని తరచుగా అంధత్వానికి గురిచేసే అన్ని భావోద్వేగాలు మరియు పక్షపాతాలను చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా పక్కన పెట్టినప్పుడు మాత్రమే, మనం అసలైన ఋజుమార్గం గురించి హేతుబద్ధమైన మరియు సరైన నిర్ణయం తీసుకోగలము.

హృదయపూర్వకమైన శుభాకాంక్షలతో,


మాజిద్ సులైమాన్ అల్ రస్సీ

మొబైల్ నెంబరు: 966 50 5906761

ఈమెయిల్: majed.alrassi@gmail.com


---

[1]. బైబిల్, తన ప్రస్తుత రూపంలోనూ, సత్యాన్వేషణ మోక్షానికి ప్రధాన కారణం కాగలదని నిర్ధారిస్తున్నది. యోహాను సువార్త 8:32లో ఇలా పేర్కొనబడింది, “సత్యమును గ్రహించెదరు; అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును.” కాలక్రమేణా గణనీయంగా మార్చబడినప్పటికీ, బైబిల్ యొక్క ప్రస్తుత ప్రతులలోనూ అసలు సత్య సందేశం యొక్క కొన్ని అంశాలు ఇంకా యథాతథంగా మిగిలి ఉన్నాయని ముస్లిములు నమ్ముతారు.

# ఇస్లాం వైపు మళ్లేలా ప్రజలను ప్రేరేపిస్తున్నది ఏమిటి?

ఇస్లాం పాశ్చాత్య దేశాలలో మరియు ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతోందనేది వాస్తవం. ఒక్క అమెరికాలోనే, ముస్లింల సంఖ్య చాలా గణనీయంగా పెరిగింది - 1900లో దాదాపు 10,000 మంది ఉండగా, నేడు ఆ సంఖ్య కొన్ని మిలియన్లకు చేరుకున్నది. ముస్లిమేతరులు ముస్లింలుగా మారడానికి ఇక్కడ నాలుగు ప్రధాన కారణాలు ఉన్నాయి:

1. విశ్వాసులందరూ అల్లాహ్ దృష్టిలో సమానమని ఇస్లాం బోధిస్తుంది. వర్ణం, రంగు, జాతి, తెగ మొదలైన ప్రతి జాత్యహంకారాన్ని మరియు వివక్షను పూర్తిగా నిషేధిస్తుంది.

2. ఇస్లాంలో మతపరమైన అధికార క్రమం లేదు; ఇస్లాంలో అర్చకత్వం లేదు, కాబట్టి మధ్యవర్తులు లేకుండా ప్రజలు అల్లాహ్ తో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉంటారు. ముస్లింలందరూ మంచి చేయమని ఆదేశించడం మరియు చెడు చేయవద్దని నివారించడం, ఇంకా తమ మతం గురించి తమకు తాముగా అవగాహన కలిగి ఉండటం గురించి బోధిస్తారు. ఇంకా వారు జ్ఞానం సంపాదించేందుకు మరియు సలహాలు పొందేందుకు ప్రసిద్ధ పండితుల వద్దకు వెళతారు.

3. ఇస్లాం తన అనుచరులందరినీ తమకు తాము సామాన్య మానవులుగా పరిగణించాలని బోధిస్తుంది. దైవత్వాన్ని దావా చేయడం ద్వారా తమను తాము గొప్పగా చెప్పుకోవడం లేదా అల్లాహ్ నుండి తమపై ప్రత్యక్ష సందేశం అవతరిస్తుందని మరియు / లేదా తాము అల్లాహ్ తో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉన్నామని లేదా అల్లాహ్ తో మాట్లాడినట్లు చెప్పుకోవడం ద్వారా సమాజాన్ని మోసం చేయడం వంటివి ఏ ముస్లిం కొరకూ అనుమతించబడలేదు. దేవుడు తనను కొడుకుగా తీసుకున్నాడని, కాబట్టి, ప్రజలు గుడ్డిగా అతడిని అనుసరించాలనే తప్పుడు దావా ఎవ్వరూ చేయలేరు!

దురదృష్టవశాత్తూ, మతాధికారులలోని కొందరు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం తమ అనుచరులను మోసగించడానికి ఇలాంటి భావనలను వాడుకుంటారు. ఒక ఉదాహరణ ఏమిటంటే, తమ అనుచరులు తమను ప్రశ్నించకూడదని మరియు తాము నిందలకు అతీతంగా ఉన్నామని తమ అనుచరులను పూర్తిగా ఒప్పించడం; వారిలో కొందరు మతగురువులు ముందడుగు వేసి, సందేహాలు అడగడానికి మరియు/లేదా వారి ద్వారా దేవుడితో తమ పాపాలకు క్షమాభిక్ష కోరడానికి వారి వద్దకు వచ్చే నిస్సహాయులతో తమ లైంగిక కోరికలు తీర్చమని గట్టిగా పట్టుబడడం.

ఇస్లాం మతంలోకి మారిన ఒక యువతితో నేను మాట్లాడాను - తాను నిద్ర నుండి మేల్కొన్న తర్వాత తనపై జరిగిన ఈ దౌర్జన్యాన్ని మరియు ఘోరమైన మోసాన్ని కనుగొన్నట్టు ఆమె నాకు తెలిపింది ... అది ఏమిటంటే, (తమ బాధ తెలుపుకోవటానికి వచ్చిన) ఆమె చివరకు తన శీలాన్ని మరియు పాతివ్రత్యాన్ని తాగిన మైకంలో మంచంపై పడి ఉన్న ఆ మతాధికారి దోచుకున్నాడని గ్రహించింది!

4. ఇస్లాం తన అనుచరులకు అల్లాహ్‌తో స్వయంగా ప్రత్యక్ష సంబంధం ఏర్పరచుకోమని మరియు దానిని మరింతగా బలోపేతం చేయమని, దాని కొరకు మరొక వ్యక్తి ద్వారా మధ్యవర్తిత్వం అవసరం లేదని బోధిస్తుంది. ఇస్లాంలో, ఒక వ్యక్తి మరియు అల్లాహ్ మధ్య మధ్యవర్తిగా వ్యవహరించడానికి చర్చి వంటి వ్యవస్థ లేదు. ఎలాంటి అధికారం లేని ఒక సాధారణ మానవుడైన చర్చి పూజారితో తాము చేసిన పాపాల గురించి చెప్పుకుని, పాప విముక్తి కొరకు దేవుడితో ప్రార్థించమని కోరటం ద్వారా మాత్రమే తన పాపాలు క్షమించ బడతాయనే భావనను ఇస్లాం ధర్మం పూర్తిగా తిరస్కరిస్తుంది.

   అల్లాహ్ పంపిన దైవచట్టాన్ని (షరిఅతును) యథాతథంగా ముస్లింలు అనుసరించాలి మరియు ఇది వారి సాఫల్యానికి దారి తీస్తుంది. ఎవరైనా ఏదైనా తప్పు చేస్తే, స్వయంగా వారు అల్లాహ్

వైపు మరలాలి, ఎందుకంటే ఆయన అమితంగా క్షమించేవాడు, అపార కృపాశీలుడు. ఇస్లాం ధర్మం మనస్సును అల్లాహ్ సమీపానికి చేర్చే మార్గంలోని అడ్డంకులు, అవరోధాలు మరియు ఆటంకాల నుండి విముక్తి చేస్తుంది, తన అనుచరులకు ఎలాంటి అవరోధం లేకుండా తిన్నగా అల్లాహ్ వద్దకు చేర్చుతుంది. ప్రజలు క్షమాపణ కోరవలసింది కేవలం అల్లాహ్ వద్ద మాత్రమేనని ఇస్లాం బోధిస్తుంది. దైవానికి ద్వారపాలకులుగా తమను తాము ప్రకటించుకుని, వారి ద్వారా మాత్రమే ప్రజలు ఆయనను చేరుకోగలరని వాదించే మధ్యవర్తుల ఆవశ్యకత (ఏ రూపంలోనైనా) అల్లాహ్ కు అస్సలు లేదు. "పూజారి" గా చెప్పుకుంటున్న ఒక మానవుడి ఎదుట తన పాపాన్ని ఒప్పుకోవడం అనే మానవ నిర్మిత భావనను ఇస్లాం ఖరాఖండీగా తిరస్కరిస్తుంది మరియు అలాంటి మధ్యవర్తుల ద్వారా మోక్షాన్ని కోరుకునే చర్యలను కూడా తిరస్కరిస్తుంది. అల్లాహ్ అన్నీ వినేవాడు, అన్నీ చూసేవాడు, అమితమైన దయగలవాడు మరియు అత్యంత మహాజ్ఞాని. ఆయన సర్వ సంపన్నుడు. ప్రజల అవసరాలు ఆయనకు తెలియ జేయడానికి మధ్యవర్తుల అవసరం ఆయనకు ఏ మాత్రమూ లేదు. ప్రజలు చేతులు పైకెత్తి, "ఓ అల్లాహ్! దయచేసి నన్ను క్షమించు; నేను పశ్చాత్తాపపడుతున్నాను, (మరలా తప్పు చేయనని) నేను వాగ్దానం చేస్తున్నాను" అని ప్రార్థిస్తే చాలు, అల్లాహ్ వారిని క్షమించి వేస్తాడు[2]. అంతే!

ఈ ప్రత్యక్ష సంబంధమే అల్లాహ్ యొక్క అనుగ్రహం మరియు క్షమాపణ పొందే సరళమైన మాధ్యమము. ఈ భావన తార్కికంగా

---

[2]. అల్లాహ్ కోసం మాత్రమే చిత్తశుద్ధితో, మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందాలని ఇస్లాం బోధిస్తుంది (బలవంతంగానో లేదా ఇతరులకు చూపడానికో కాదు). అయితే, పాపం చేయడం మానివేయాలి, చిత్తశుద్ధితో మనస్ఫూర్తిగా పశ్చాత్తాపపడాలి, మరలా దాని వైపు మరలననే దృఢసంకల్పం చేసుకోవాలి.

మరియు సూటిగా ఉంటుంది; ఎవరైనా వినడానికి మరియు నమ్మడానికి సహజంగానే సంతోషిస్తారు.

అయితే, తనకు సాటిగా భాగస్వాములను చేర్చేవారి అంటే షిర్క్ చేసే వారి క్షమాభిక్షను తిరస్కరిస్తానని అల్లాహ్ మానవాళిని ఇలా తీవ్రంగా హెచ్చరిస్తున్నాడు:

{(ఇంకెవరినైనా, మరిదేనినైనా) తనకు సాటి కల్పించడాన్ని నిశ్చయంగా అల్లాహ్ అస్సలు క్షమించడు. అదిగాక, మరింక దేనినైనా – తాను తలచిన వారి కొరకు క్షమిస్తాడు. మరియు ఎవరైతే అల్లాహ్ కు సాటి కల్పిస్తాడో, నిస్సందేహంగా అతడు అపమార్గం పట్టి, మార్గభ్రష్టత్వంలో బహుదూరం వెళ్ళిపోయాడు.}

*(ఖుర్ఆన్ 4: 116)*

# ఆమె తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం

ఇస్లాం ధర్మం చాలా వేగంగా అభివృద్ధి చెందుతున్న ధర్మమని తరచుగా వార్తలలో వస్తూ ఉంటుంది. ఇస్లాం స్వీకరించిన ప్రతి వ్యక్తి వెనుక ఒక ప్రత్యేకమైన గాథ మరియు ప్రత్యేక కారణాలు ఉంటాయి. ఇస్లాంలో స్త్రీల గురించిన అపోహలు విస్తృతంగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ఇస్లాం ధర్మమే నిజమైన ధర్మమనీ మరియు ఉత్తమ జీవన విధానమనీ విశ్వసించే మహిళల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ఆన్ రోనైన్ (Ann Ronayne) కథ క్రింద పేర్కొనబడింది; పాఠకులు ఆమెకు నేరుగా ఇమెయిల్ కూడా చేయవచ్చని ఆమె అనుమతించింది. ann.ronayne1@gmail.com.

“"నేనా? కువైట్‌లో ఉండేందుకు వెళ్లాలా? అస్సలు ఆ ప్రశక్తే లేదు!" నా మేనేజర్ నన్ను కువైట్‌లో ఉద్యోగం చేయమని ఒప్పించేందుకు ప్రయత్నించినప్పుడు నా స్పందన అది. కానీ నా విధివ్రాతలో మరో విధంగా ఉంది, {... మరియు అల్లాహ్ ఆజ్ఞ, నిర్దేశింపబడిన (తిరుగులేని) శాసనం;} *(ఖుర్ఆన్ 33: 38)*[3]

నేను వాషింగ్టన్, D.C. నగర పరిసర ప్రాంతాలలో ఒక కాథలిక్ కుటుంబంలో పుట్టి పెరిగాను మరియు క్యాథలిక్ పాఠశాలలకు హాజరయ్యాను. 1960వ దశకంలో, మరింత ఆధునికంగా ఉండాలనే ప్రయత్నంలో కాథలిక్ చర్చి తన బోధనలలో పెద్ద మార్పులు చేసింది; ఇది సానుకూల అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టడానికి మరియు ప్రతికూల అంశాలను విడిచి పెట్టడానికి ప్రయత్నించింది: ఉదారహణకు శిక్షలు, నిబంధనలు, నిర్దిష్ట సమయాల్లో కొన్ని ఆహార పదార్థాలకు దూరంగా ఉండటం మొదలైనవి. (అదలా ఉన్నప్పటికీ, ఇప్పటికే పాశ్చాత్య దేశాల్లోని కాథలిక్కులు ఉనికిలో ఉన్న గర్భనిరోధకాలపై నిషేధం వంటి

---

[3]. ఈ తెలుగు భావానువాదం “దివ్యఖుర్ఆన్ సందేశం” నుండి తీసుకోబడింది.

అనేక నియమాలను విస్మరించింది.) లాటిన్‌లో ఎప్పుడూ చెప్పబడే 'ప్రార్థనకు'కు బదులుగా ఇప్పుడు ఆంగ్లంలో చెప్పబడుతున్నది. చిన్నప్పుడు మాకు మత బోధనలు నేర్పిన క్రైస్తవ సన్యాసినులు (నన్సు) వారి అలవాట్లను (ధర్మపరమైన దుస్తులను) ఆధునిక దుస్తులతో మార్చుకున్నారు. మా ధార్మిక తరగతులలో ఎప్పుడూ బైబిల్ పఠనం జరగ లేదు, ఇప్పుడైతే వారు మత విశ్వాసాలపై దృష్టి సారించే బదులు, సామాజిక సమస్యలపై దృష్టి సారిస్తున్నారు. కొత్త జనాల మాదిరిగానే చాలా వరకు సమకాలీన జానపద పాటలతో కాలం గడుపు తున్నారు. మా కాలంలో బోధించ బడిన సత్యం ఇప్పుడు పూర్తిగా మారిపోవడం వింతగా అనిపించింది. ఏదేమైనప్పటికీ, మేము మా మొదటి హోలీ కమ్యూనియన్‌కు సిద్ధమైనప్పుడు, పూజారి మా నోటిలో పెట్టే రొట్టె యేసు యొక్క అసలు శరీరమని మాకు బోధించబడింది (అది మనం కొరికితే రక్తస్రావం అవుతుంది). దీని వలన మరియు ఇలాంటి అనేక ఇతర కారణాల వలన, నేను నా మతంపై సందేహాలు పెంచుకున్నాను మరియు చిన్నప్పటి నుండి అలాంటి క్రైస్తవ మత విశ్వాసాలను తిరస్కరించాను.

నేను మరిన్ని విషయాలు తెలుసుకున్న తరువాత నా నిర్ణయం మరింతగా గట్టి పడింది. ఒకవేళ ట్రినిటీ చాలా ముఖ్యమైన భావనైతే, యేసు దానిని ఎందుకు స్పష్టంగా వివరించలేదు (ఇంకా ఎందుకు దానిని పదే పదే పునరావృతం చేయలేదు)? దేవుడు మనల్ని క్షమించాలని అనుకుంటే, మన పాపాలకు ప్రాయశ్చిత్తం చేయడానికి స్వయంగా భూమి పైకి రాకుండా మరియు సిలువ వేయబడకుండానే ఆయన అలా చేయ గలడు కదా. సిలువపై మరణించినది - యేసు వ్యక్తిగానా లేక యేసు దేవుడిగానా? ఆది మరియు అంతం లేని దేవుడు ఎలా మరణిస్తాడు? మనకు మార్గనిర్దేశం చేయడానికి దేవుడు తన కుమారుడిని (అతడు కూడా దేవుడే?) భూమికి పంపితే, అతను తన ముప్పై మూడు సంవత్సరాల కాలంలో మనకు సత్యసందేశాన్ని అంద జేయకుండా

ఎందుకు నిర్లక్ష్యం చేస్తాడు? మరి, యేసును ఎప్పుడూ కలవని పాల్, ఆ తర్వాత సత్యసందేశాన్ని కనుగొని మనకు అందించటం ఏమిటి?! ఒకవేళ ఆ క్రైస్తవ మతమే నిజమైన మతం అయితే, యేసు స్వయంగా ఎందుకు జీవించి ఉండలేదు మరియు దానిని మనకు బోధించలేదు?

చాలా కాలం వరకు, నాకు నేను నాస్తికుడిగా లేదా అజ్ఞేయవాదిగా భావించాను. కానీ నేను ఏదైనా లేబుల్ ఎంచుకోవడం గురించి ఎన్నడూ ఆలోచించలేదు. నేను మంచి వ్యక్తిగా ఉండటానికి ప్రయత్నించడంతో సరిపోతుందని భావించాను. దేవుడిని విశ్వసించనివారే నిజానికి ఎక్కువ మంచి పనులు చేస్తారని భావించాను. ఎందుకంటే వారు సహాయం కోసం ఏ అతీంద్రియ శక్తి పైనా ఆధారపడరు. నేను జీవిత ఉద్దేశ్యానికి లేదా మత విశ్వాసాలకు సంబంధించిన సమాధానాల కోసం అన్వేషిస్తున్నట్లుగా ఎన్నడూ భావించలేదు.

గల్ఫ్ యుద్ధం ముగిసిన కాలం నాటి సంగతి. అపుడు నేను కంప్యూటర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నాను, నా కంపెనీకి కువైట్‌లో ప్రాజెక్టు లభించింది, అది నాకు నూటికి నూరు పాళ్ళు సరిపోయే పనే. అక్కడికి నన్ను వెళ్ళమని అన్నప్పుడు నా తొలి స్పందన - స్త్రీలను ద్వితీయ శ్రేణి పౌరులుగా పరిగణించే ప్రదేశానికి వెళ్లి పని చేయాలనే కోరిక నాకు లేదు; అన్నింటి కంటే ముఖ్యంగా, కువైట్ వంటి చోట స్త్రీల గురించి సామాన్యంగా వినబడే వదంతులు ఎన్నో నా వద్ద ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఉన్న మా మేనేజర్, 'అక్కడి ఆఫీసు వాతావరణం చాలా ప్రొఫెషనల్‌గా ఉందని, ఆ సంస్థలో ఉండబోయే నా సూపర్'వైజర్ మరియు మేనేజర్లతో పాటు చాలా మంది ప్రతిభావంతులైన మహిళలు ఉన్నారని' నాకు హామీ ఇచ్చారు. ఎలాగోలా ఒక సంవత్సరం కాంట్రాక్టుపై సంతకం చేయించారు. అక్కడ పని చేయడం ఒక సాహసమేనని భావిస్తూ నేను దానికి అంగీకరించాను.

అయితే, నాతో తెచ్చుకున్న వదంతులన్నీ పచ్చి అబద్ధాలని అక్కడికి చేరగానే నాకు తెలిసింది.

నా సహోద్యోగులు ఎల్లప్పుడూ నాతో స్నేహపూర్వకంగా మరియు మర్యాదగా మెలిగేవారు. నా జీవితంలో ఇంత వరకు లైంగిక వేధింపులకు సంబంధించిన ఎలాంటి ఘటనలూ నేను చూడని ఒకే ఒక్క ప్రదేశం ఇదేనని నాకు అనిపించింది - ఆ వాతావరణం ఎంత పవిత్రంగా ఉందంటే, అక్కడ కనీసం మామూలుగా ఆఫీసు డెస్కులపై వేలాడుతూ ఉండే మనోరంజక కుళ్ళు జోకులు కూడా అక్కడ కనబడవు, డేటింగ్ తేదీల క్యాలెండర్‌లు కూడా కనబడవు. (ఇది ఖచ్చితంగా US మిలిటరీలో నేను అనుభవించిన వాతావరణానికి పూర్తి భిన్నంగా ఉంది.) నాతో పని చేస్తున్న అక్కడి మహిళలలో చాలామంది విశ్వవిద్యాలయ గ్రాడ్యుయేట్లు మరియు మనసు విప్పి మాట్లాడటానికి సిగ్గుపడరు. అయినా వారిలో ఎక్కువ మంది ఇస్లామీయ దుస్తులు ధరించడాన్నే ఎంచుకున్నారు. తద్వారా తమ దుస్తులను వాణిజ్య ప్రకటనలు ప్రదర్శించబడే ఎడ్వర్టైజ్మెంటు బోర్డుల వలే వాడుకునే అవకాశాన్ని వారు కల్పించలేదు.

కుటుంబాలు మరియు సమాజ సభ్యుల మధ్య కనబడిన పవిత్ర బంధాలు నన్ను ఎంతో ఆకట్టుకున్నాయి. ఒక సహోద్యోగి తన పేచెక్ (జీతం) పోగొట్టుకుంటే, అతని కోసం అదే మొత్తంలో డబ్బును సేకరించే వరకు ఎవ్వరూ విశ్రమించలేదు. అక్కడి ప్రజలు స్థానికంగానూ మరియు ప్రపంచ వ్యాప్తంగానూ ఉదారంగా నిరుపేదలకు దానధర్మాలు చేసేవారు.

ఒకరి తల్లి ఫోన్ చేసి తనకు ఏదోలా ఉందని చెప్పినప్పుడు, ఆ వ్యక్తి ఆమెను వైద్యుడి వద్దకు తీసుకెళ్లడానికి లేదా ఆమెకు అవసరమైనది అందించడానికి తన పని విడిచి పెట్టి వెళ్ళిపోవడం; మరొక వ్యక్తి యొక్క మామ చనిపోతే, పురుషులందరూ అంత్యక్రియల ప్రార్థనకు హాజరు కావడం; ఒక స్త్రీ అత్త చనిపోతే, స్త్రీలందరూ తమ సంతాపాన్ని తెలియ జేయడానికి ఆమెను సందర్శించడం; ఎవరైనా వివాహం చేసుకుంటే లేదా బిడ్డకు జన్మనిస్తే లేదా ఏదైనా ఆపరేషన్ నుండి కోలుకుంటే కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సహోద్యోగుల విస్తృత నెట్‌వర్క్ ఆ అనుభవాన్ని సుహృద్భావంతో పంచుకోవడం; అక్కడి ఆసుపత్రి గదులు

చాలా పెద్దవిగా ఉండి, రోగులను పరామర్శించేందుకు అక్కడికి వచ్చే సందర్శకులందరికీ వసతి కల్పించడానికి వీలసుగా సోఫాలు మరియు కుర్చీలతో కూడా అమర్చబడి ఉండడం మొదలైన వాటిని నేను ఎంతో సంభ్రమాశ్చర్యాలతో చూసేదాన్ని.

అక్కడ పెద్ద కుటుంబాలు ఒకే ఇంట్లో అనేక తరాలతో పాటు కలిసి జీవిస్తూ ఉన్నందు వలన, వృద్ధుల పట్ల వైఖరి నేను అంతకు ముందు చూసిన దానికి భిన్నంగా ఉండేది; ఒకే ఇంట్లో నివసించని వారు, రోజూ కాకపోయినా తరచుగా తమ పెద్దలను సందర్శించడానికి వచ్చేవారు. తాతా నాయనమ్మలు పిల్లలతో మరియు మనుమలు ఆ పెద్దలతో నివసిస్తుండేవారు. అలా ఆ పెద్దలను ఒంటరిగా జీవిస్తూ, ఏకాకిగా చనిపోవడానికి వదిలిపేయలేదు లేదా నర్సింగ్ హోమ్‌లకు పంపలేదు (అలాంటివి కూడా అక్కడ లేవు). వృద్ధ స్త్రీలను ఎంతో గౌరవించేవారు; అందువలన ఇతరుల దృష్టిని తమ వైపు మళ్ళించేందుకు, ఇతరులను ఆకర్షించేందుకు తమ వయసు దాచుకునేందుకు మరియు అందంగా కనిపడేందుకు ప్రయత్నించ వలసిన అవసరం వారికి లేదు. ఒకరి వృద్ధ తల్లిదండ్రులను చూసుకోవడం ఒక భారంగా కాకుండా మంచి పనులు చేయడానికి లభించిన ఒక ఆశీర్వాదంగా మరియు అవకాశంగా భావించే వారు. ఒకరి తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత గురించి ఇస్లామీయ నైతిక వ్యవస్థలో గట్టిగా నొక్కి చెప్పబడింది. (అయితే పాశ్చాత్య దేశాలలోని ముస్లిమేతరులు తమ తల్లిదండ్రులను పట్టించుకోరని చెప్పడం లేదు, కానీ వారికి విభిన్నమైన ప్రాధాన్యతలు మరియు అవసరాలు ఉన్నాయి. సాధారణంగా చిన్న కుటుంబాలు మరియు స్వతంత్ర కుటుంబాలు ఎక్కువ ఆకర్షణీయంగా, సానుకూలంగా కనబడతాయి. ఎందుకంటే వృద్ధులు స్వయంగా తమకు తాము పిల్లల కుటుంబంపై భారంగా మారడాన్ని కోరుకోరు.) సాధారణంగా, క్లిష్ట పరిస్థితులతో చక్కగా వ్యవహరించడం అనేది ఒక పరీక్షగా భావించబడిందే గానీ  నిరాశకు

కారణంగా కాదు. ఇక్కడ ఆత్మహత్యలు చాలా అరుదు, ఇక్కడ నిషేధం కూడా ఎందుకంటే అల్లాహ్‌కు మాత్రమే ప్రాణం తీసే హక్కు ఉంది.

పవిత్ర రమదాన్ మాసం వచ్చినప్పుడల్లా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఒక బిలియన్ ముస్లింలు కలిసికట్టుగా ఏకకాలంలో ఉపవాసం ఉంటారనే ఆలోచన నన్ను చాలా ఆశ్చర్యపరిచింది - ప్రతిరోజూ సూర్యోదయానికి ముందు నుండి సూర్యుడు అస్తమించే వరకు వారు అన్నపానీయాలకు దూరంగా ఉంటారు. నేను వారితో కలిసి నెల మొత్తం ఉపవాసంలో పాటించాను, అయినప్పటికీ నాకు ముస్లిం కావాలనే ఉద్దేశం లేదు. కానీ, నేను ముస్లింగా మారిన తర్వాత రమదాన్ నెల ఉపవాసాలలో అనుభూతి చెందిన ఆధ్యాత్మిక రీఛార్జ్‌ను నేను ముస్లిం కాకుండా ఉన్న రమదాన్ ఉపవాసాలలో అనుభవించలేదు.

ఆ సమయంలో, నాకు ఇస్లాం గురించి కొంచెం మాత్రమే తెలుసు. ఇస్లాంను వెనుకబడిన మతంగా భావించడమనేది అజ్ఞాన ప్రజలకు మాత్రమే నచ్చుతుందని చెప్పడానికి ఇప్పుడు సిగ్గుపడుతున్నాను. నేను తెచ్చుకున్న వదంతులన్నీ తప్పని మెల్లమెల్లగా అర్థమయ్యాక, నాకు ఇస్లాం ధర్మం పట్ల ఆసక్తి కలిగింది. నేను మరింతగా తెలుసుకున్నప్పుడు, నేను చూసిన నైతిక వ్యవస్థకు ఇస్లామే కారణమనీ మరియు ఈ సానుకూల సామాజిక అంశాలు శతాబ్దాలుగా ఇస్లామీయ సమాజాలలో భాగంగా ఉన్నాయని నేను గుర్తించాను. లిఫ్టు లేదా ఆఫీసులలో ప్రవేశించగానే అపరిచితుల మధ్యా వినబడే అస్సలాము అలైకుమ్ అనే శుభాకాంక్షల అభివాదం వంటి చిన్న చిన్న విషయాలు కూడా ఇస్లాం బోధనలలో ప్రామాణికతను, ఆధారాల్ని కలిగి ఉన్నాయి.

నాకు ఖుర్ఆన్ అనువాదం మరియు ఇస్లాంకు సంబంధించిన కొన్ని పుస్తకాలను లభించాయి. నేను వాటిని చదవడం ప్రారంభించాను. పదే పదే, నేను కనుగొన్న వాటిని చూసి ఆశ్చర్యపోసాగాను, ఇంకా అంతకంటే ఎక్కువగా నేను కనుగొనని వాటి గురించి ఆలోచిస్తూ. ఇస్లాంలో నేను హేతుబద్ధమైన మరియు గజిబిజీగా లేని ఒక నమ్మక వ్యవస్థను

గుర్తించాను. నేను ఊహించినంతగా స్త్రీల అణచివేత లేదా అత్యాచారాల్ని కనుగొనలేదు. ఇస్లాం ధర్మం సామాజిక న్యాయానికి ఎంతో ప్రాధాన్యత నివ్వడం, అణచివేతకు వ్యతిరేకంగా నిలబడటం నన్ను ఆకర్షించింది.

సహజంగానే, ఏ మతానికైనా సంబంధించిన ప్రధాన ప్రశ్న - అది నిజమైనదా, కాదా అనే నిర్ణయం. ఈ నిర్ణయం కొంతవరకు విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, మనం దానిని నిజంగా ఎలా తెలుసు కోగలం? దానిని తెలుసుకోవడానికి ఉపయోగపడే ఒక అంశం ఏమిటంటే ఆ మతం యొక్క మూలాల విశ్వసనీయత, ప్రామాణికత; మరి, ఇస్లాం విషయంలో, దాని అత్యంత ముఖ్యమైన మూలం ఖుర్ఆన్ గ్రంథము.

ఇటీవల వరకు కనుగొనబడని శాస్త్రీయ దృగ్విషయాలను వివరించే వచనాల ద్వారా ప్రదర్శించబడిన దాని శాస్త్రీయ ఖచ్చితత్వం చూసి నేను మరింతగా ఆశ్చర్యపోయాను. యూరోపు చీకటి యుగంలో ఉన్నప్పుడు ఇస్లామీయ ప్రపంచం శాస్త్రీయ విజ్ఞానానికి పెద్దపీట వేసిందని, నాగరికత మరియు విద్యాభ్యాసానికి కేంద్రంగా ఉండేదని గ్రహించాను. తార్కికంగా, ఏడవ శతాబ్దపు నిరక్షరాస్యుడైన ఒక అరబ్, ఈ గొప్ప ఖుర్ఆన్ గ్రంథాన్ని స్వయంగా వ్రాయలేడని నాకు తెలుసు. సృష్టికర్త లేడనే నా ఆలోచనపై నన్ను నేను ప్రశ్నించుకోవడం ప్రారంభించాను - విశ్వం మరియు దాని జీవిత రూపాలను రూపొందించిన సంక్లిష్ట వ్యవస్థలు యాదృచ్ఛికంగా అభివృద్ధి చెందాయా లేదా మనం పుట్టాము, జీవించాము మరియు ఎలాంటి ప్రయోజనం లేకుండా మరణించాము, వాస్తవం ఇంతేనా.

ఇన్నాళ్లుగా ఖుర్ఆన్ ఎన్నడూ మార్చబడలేదనే వాస్తవం నన్ను ఇంకా ఆకట్టుకున్నది. ఈ రోజు మనం చదివే ఖుర్ఆన్, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వస్లం) పై 1400 సంవత్సరాల క్రితం అవతరించిన మరియు ఆయన దానిని తన సహచరులకు అందించిన విధంగానే (అది అవతరించిన అసలు అరబీ భాషలో) ఎలాంటి మార్పులు చేర్పులకు గురికాకుండా శతాబ్దాలకు తరబడి దాని అసలు రూపంలోనే మిగిలి ఉంది. ముస్లింలందరూ దానిలోని భాగాలను కంఠస్థం చేస్తారు

మరియు ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల కొద్దీ ప్రజలు దీనిని పూర్తిగా కంఠస్థం చేసిన వారున్నారు. కాబట్టి భూమిపై నుండి దాని ప్రతి కాపీ అదృశ్యం చేయబడినా, అది చాలా సులభంగా మళ్ళీ లిఖించబడ గలదు. దీనిని కాలక్రమేణా వివిధ వ్యక్తులు వ్రాసిన పుస్తకాల సమాహారమైన బైబిల్‌తో పోల్చడానికి నేను సాహసం చేయలేకపోయాను; వివిధ క్రైస్తవ వర్గాలు ఏ పుస్తకాలు చేర్చబడ్డాయో ఏ పుస్తకాలు చేర్చబడలేదో అనే దానిని కూడా అంగీకరించవు, కొన్ని సందర్భాల్లో, విద్వాంసులకు సువార్తల పుస్తకాలు ఎవరు రాశారో కూడా తెలియదు. వారి వద్ద అసలు మూలాలు లేవు కానీ, తరువాత కాలంలోని మూలాల యొక్క విభిన్న సంస్కరణలు ఉన్నాయి. వాటిలో అనేక వైరుధ్యాలు ఉన్నాయి. నిజానికి, పాతనిబంధనలోని అనేక బోధనలను కొత్తనిబంధన తిరస్కరించింది.

ఇస్లాం ధర్మం యొక్క మూలాలు, యూదమతం మరియు క్రైస్తవ మతాల మూలాలు ఒక్కటే అని మరియు ముస్లింలు కూడా అబ్రహాం, మోసెస్ మరియు జీసస్ (అలైహిస్సలాం)లతో సహా ప్రవక్తలందరినీ విశ్వసిస్తున్నారని తెలుసుకుని నేను మరింతగా ఆశ్చర్యపోయాను.

ముస్లింలు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఎందుకు అంతగా ప్రేమిస్తారో అనే విషయాన్ని అర్థం చేసుకునేందుకు ప్రయత్నించాను. ఎందుకు ఆయన (స) గురించి నాకు ఇంత వరకు ఏమీ తెలియలేదని ఆశ్చర్యపోయాను. ఆయన (స) ఎంతో ప్రఖ్యాతి చెందిన ఒక చారిత్రక వ్యక్తి అని, ఆయన సమాధి ఎక్కడ ఉందో కూడా ఎంతో మందికి తెలుసని మరియు ఎంతో మంది ఆయన (స) మస్జిదును సందర్శిస్తారని కూడా నాకు తెలియదు. ఆయన (స) యొక్క అత్యంత సన్నిహితుల నుండి వచ్చిన ప్రామాణిక హదీథులు అనబడే ఉల్లేఖనలు, ఆయనను ఒక నిరాడంబరమైన, నిజాయితీ గల వ్యక్తిగా, న్యాయం కోసం మరియు అణచివేతకు వ్యతిరేకంగా నిలబడిన వ్యక్తిగా వర్ణిస్తున్నాయి.

ఖుర్ఆన్ సూచించినట్లుగా, నేను రాత్రిపూట బీచ్ వెంబడి నడుస్తూ, చంద్రుడిని మరియు నక్షత్రాలను చూస్తూ, అల్లాహ్ యొక్క సృష్టిని

గురించి అర్థం చేసుకునేందుకు ప్రయత్నం చేస్తూ ఉండేదానిని. ఖుర్ఆన్ తప్పనిసరిగా అల్లాహ్ నుండి వచ్చిన సందేశమేనని నేను నమ్మసాగాను. కానీ, ఇస్లాం ధర్మాన్ని స్వీకరించడానికి నాకు కొంత సమయం పట్టింది... అయినప్పటికీ అది చాలా హేతుబద్ధమైనది మరియు దాని సారాంశంలో అది చాలా సరళమైనది: ఏకైక దైవం, విశ్వం యొక్క మరియు దానిలోని ప్రతి దాని యొక్క ఏకైక సృష్టికర్త, ఆయనే మనకు ఇహలోక జీవితంలో మరియు తదుపరి పరలోక జీవితంలో మన జీవితాలను ఉత్తమంగా మార్చుకునేందుకు మార్గదర్శకత్వం అందించినాడు. అంతేకాదు! మరెన్నో ఖచ్చితమైన వివరాలు ఉన్నాయి. అయితే, ఇస్లామీయ విశ్వాసాలను సంగ్రహించేందుకు ఇది సరిపోతుంది మరియు ఎవరైతే దీనిని అంగీకరిస్తాడో, ఆ వ్యక్తి తప్పకుండా ముస్లిం అయి పోతాడు.

ఇస్లాం ధర్మంలోని దైవభావన చాలా స్వచ్ఛంగా, తార్కికంగా అనిపించింది, ముఖ్యంగా ట్రినిటీ భావనతో పోల్చినప్పుడు. ట్రినిటీని హేతుబద్ధంగా వివరించలేరు. ముగ్గురు దేవుళ్ళు ఉన్నారు, కానీ వారు ఒక దేవుడా? యేసు పూర్తిగా దైవికుడు మరియు పూర్తిగా మానవుడు, తద్వారా అతను శక్తివంతుడైనప్పటికీ ఆకలి, దాహం మరియు ఇతర భౌతిక అవసరాలను అనుభవించాడా? దానికి భిన్నంగా, ఇస్లాం యొక్క సంక్లిష్టత లేని ప్రధాన సూత్రం - దైవం ఒక్కడే - ఇది ఖుర్ఆన్ గ్రంథంలో, ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ప్రవచనాలలో మరియు సామాన్య ముస్లింల ప్రార్థనలలో పదే పదే పునరావృతం అవుతుంది. ట్రినిటీ భగవంతుని యొక్క నిజమైన సారాంశమే అయితే, దానిని స్పష్టంగా వివరించి, పదే పదే ప్రస్తావించి ఉండేవారు కాదా?

**ఇస్లాంలో దైవం న్యాయవంతుడు; మనకు సంబంధం లేని మరొకరి పాపాలకు ఆయన మనలో ఎవరినీ బాధ్యులుగా చేయడు.** వేరొకరు చేసిన అసలు పాపం నుండి మనందరినీ విముక్తి చేయడం, అసలు పాపం లేదా సిలువ వేయడం వంటి ఎలాంటి భావనా లేదు.

నిజానికి, నా జీవితంలో ఆ ముఖ్య నిర్ణయం తీసుకోవడానికి నాకు అసమ్మతమైన కొన్ని అంశాలు ఆటంకంగా నిలబడినాయి. ఉదాహరణ: నేను ఇస్లామీయ దుస్తుల యొక్క ఉద్దేశాన్ని మరియు ప్రయోజనాలను అర్థం చేసుకున్నప్పటికీ, ఇంగ్లీష్ మాట్లాడే ముస్లిం మహిళల సంస్థలో ఏర్పాటు చేయబడిన రమదాన్ విందులో హాజరయ్యే వరకు మరియు ఇస్లామీయ దుస్తులను ధరించడం గర్వంగా భావించే ఇస్లాం ధర్మాన్ని స్వీకరించిన డజన్ల కొద్దీ పాశ్చాత్య మహిళలను కలిసే వరకు నేను దానిని ధరించడం గురించి అంగీకరించ లేకపోయాను.

పైన పేర్కొన్న అన్ని కారణాల వల్ల మరియు ఎవరి ఒత్తిడి లేకుండా, నేను ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క వాక్కు మరియు ఇస్లాం సత్యమైన ధర్మమనే నిర్ధారణకు వచ్చాను.

నా ఇస్లామీయ విశ్వాసాన్ని అధికారికంగా ప్రకటించడానికి నేను సిద్ధంగా ఉన్నానని నిర్ణయించుకున్న రోజున, అధికారికంగా అలా చేయడంలో నాకు సహాయం చేయమని నేను ఒక సహోద్యోగిని అడిగాను. వాస్తవానికి దీన్ని బహిరంగంగా చెప్పాల్సిన అవసరం లేదు లేదా ఎలాంటి సర్టిఫికేటూ పొందవలసిన అవసరం లేదు; విశ్వాసం యొక్క సాక్ష్యప్రకటనపై అంటే కేవలం అల్లాహ్ తప్ప ఆరాధనలకు అర్హుడైన వాడెవ్వడూ లేడని మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త అని సాక్ష్యమివ్వడంతోనే సరిపోతుంది. ఇది నన్ను బాగా కదిల్చి వేసిన అనుభవంగా గుర్తుండి పోయింది. ఎందుకంటే నిశ్చయంగా ఆ క్షణం నుండి నేను పరిశుభ్రమైన పలకతో (క్లీన్ స్లేట్‌తో) పాపాలేమీ లేని కొత్త జీవితాన్ని ప్రారంభించాను. నిస్సందేహంగా జీవితంలో నేను తీసుకున్న అత్యుత్తమ నిర్ణయం ఇదే.

ఆఫీసుకి తిరిగి వచ్చాక, నా డెస్క్‌కి చేరుకుని నా పనిలో నిమగ్నమై పోయాను. ఇది నా వ్యక్తిగత నిర్ణయం తప్ప మరేమీ కాదని నేను భావించాను. నేను తీసుకున్న గంభీరమైన నిర్ణయం ఎవరికీ తెలియదని అనుకున్నాను ... కానీ నా స్నేహితురాలు దానిని అందరికీ చెప్పేసింది.

నేను ఆశ్చర్యపోయేలా, ఆ రోజంతా ఎంతో మంది శ్రేయోభిలాషుల నుండి అభినందనలు అందుకుంటూనే ఉన్నాను. ఆ సాయంత్రం, ఆమె నన్ను తన ఆంటీ ఇంటికి ఆహ్వానించింది. అక్కడ కొన్ని గంటలలోనే ఆమె తల్లి, సోదరీమణులు, ఆంటీలు మరియు ఆమె కజిన్ సిస్టర్స్ (వీరిలో చాలా మందిని నేను ఇంతకు ముందెన్నడూ కలవలేదు) అందరూ కలిసి నా కోసం ఒక పార్టీ ఏర్పాటు చేసి, ఖుర్ఆన్లు, సలాహ్ దుస్తులు, బంగారం మొదలైన ఎన్నో బహుమతులు నాకు ప్రజెంట్ చేసారు. తర్వాతి రోజులు మరియు వారాల్లో, నేను సహోద్యోగుల నుండి (వీరిలో కొందరిని నేను ఎప్పుడూ కలవలేదు), స్నేహితులు మరియు పరిచయస్తుల నుండి డజన్ల కొద్దీ గిఫ్టులు అందుకున్నాను. నేను చాలా అదృష్టవంతురాలిని, ఎందుకంటే ఇస్లాం స్వీకరించిన తరువాత కొందరు అనేక కష్టాలు ఎదుర్కొన్నారనే విషయం నాకు తెలుసు.

నా మహిళావాద ఉద్యమ కాలంలో, మేము 'సోదరిత్వం' గురించి మాట్లాడుకునే వారం, కానీ ఇక్కడ నిజమైన సోదరిత్వం నాకు పరిచయం అయింది. ముస్లిం మహిళలు కేవలం అల్లాహ్ కొరకు నన్ను తమ సోదరిగా స్వీకరించారు. కాలం గడుస్తున్న కొద్దీ నేను వివిధ దేశాలకు, వర్గాలకు చెందిన మరియు విద్యావంతులైన అనేక అద్భుతమైన ముస్లిం స్త్రీలను కలుసుకున్నాను. మా సమావేశాలలో తరచుగా, (ఇస్లామీయ జీవితాన్ని పొందిన) మేము ఎంత అదృష్టవంతులమో, మా జీవితాలు చాలామంది ప్రజలు ఊహించే దాని కంటే ఎంత భిన్నంగా ఉన్నాయో అనే విషయాలపై తరచుగా మాట్లాడుకునే వారం. ఒకరికొకరు పరిచయం ఉన్నా, పరిచయం లేకపోయినా ఇస్లాంలో మనం సోదరీమణులమని తెలుసుకుని, అనేక మంది స్త్రీలతో ఒకే పంక్తిలో భుజం భుజం కలిపి సలాహ్ లో నిలబడే అనుభూతిని వర్ణించడం అసాధ్యం.

హిజాబ్ (ఇస్లామీయ హెడ్‌స్కార్ఫ్) ధరించే ధైర్యాన్ని పెంపొందించు కోవడానికి నాకు చాలా వారాలు పట్టింది. నేను ఊహించని విధంగా ఆ సంకోచం నుండి నాకు విముక్తి లభించింది. నేను ముస్లింగా మారగానే

మొదట హిజాబ్ ధరించి U.S.కి వెళ్లటం గురించి నేను ఆందోళన చెందాను, కానీ వాస్తవానికి అలా ఆందేళన చెందవలసిన అవసరం లేదు. నేను వెళ్లిన ప్రతిచోటా, ఇతర ముస్లింలు నాకు ఇస్లామీయ అభివాదమైన అస్సలాము అలైకుమ్ (మీపై శాంతి కలుగుగాక) తో పలకరించేవారు. ఆ అభివాదం ద్వారా ప్రపంచవ్యాప్త ముస్లిం సమాజంలో ఒక భాగంగా నేను స్వాగతించబడటమనేది హిజాబ్ ద్వారా సాధ్యమవుతుందని గ్రహించాను; నేను దానిని ధరించకపోతే, ఇతర ముస్లింలు నేను కూడా ముస్లిమేనని గుర్తించి, నాకు అలా సలామ్ తో అభివాదం చెప్పేవారు కాదు కదా!

అలాగని ముస్లిం సమాజం ఒక రకంగా పరమ సుఖదాయమైన ఆదర్శ సమాజమని చెప్పడం కూడా నా ఉద్దేశ్యం కాదు. ఖచ్చితంగా, ముస్లిం సమాజంలోనూ అనేక సమస్యలు ఉన్నాయి, కానీ ఆ సమస్యలు ఇస్లాం నుండి కాదు; దీనికి భిన్నంగా, ఆ సమస్యలు ఇస్లామీయ విశ్వాసాల మరియు ఆచరణల పట్ల అజ్ఞానం, వాటి తిరస్కరణ కారణంగా ఉత్పన్నం అవుతున్నాయి. వాస్తవం ఏమిటంటే ఇస్లాం ధర్మానికి సంస్కరణల అవసరం లేదు; కానీ ముస్లింలకు దానవసరం ఎంతైనా ఉంది

# గతంలో క్రైస్తవులుగా ఉన్న కొందరు నవముస్లింలు

ఇస్లాం స్వీకరించిన చాలామంది క్రైస్తవ స్త్రీపురుషులు అన్ని నేపథ్యాల నుండి, అన్ని దేశాల నుండి మన ముందు ఉన్నారు. వారు ఇస్లాం ధర్మాన్ని ఎంచుకుని తమ క్రైస్తవ మతాన్ని తిరస్కరించే ముందు, ఆ క్రైస్తవ మతాన్ని మనస్ఫూర్తిగా, క్షుణ్ణంగా అధ్యయనం చేసిన కొందరు సుప్రసిద్ధ సమకాలీన నవముస్లింల క్లుప్తమైన ప్రస్తావనలు క్రింద పేర్కొనబడినాయి. వారి కథనాలు (అలాగే వారి పుస్తకాలు, వ్యాసాలు మరియు వీడియోలు) ఆన్‌లైన్‌లో ఆంగ్లంలో సులభంగా అందుబాటులో ఉండటం వలన వారిని ఇక్కడ ఎంపిక చేయడం జరిగింది.

**డాక్టర్ జెరాల్డ్ డిర్క్స్ (Dr Jerald Dirks)** ఒక అమెరికన్ మాజీ మెథడిస్ట్ డీకాన్(క్రైస్తవంలో నైష్ఠిక వర్గానికి చెందిన ఉపగురుపు). హార్వర్డ్ విశ్వవిద్యాలయం (Harvard University) నుండి దివ్యత్వం (Divinity) లో మాస్టర్స్ మరియు డెన్వర్ విశ్వవిద్యాలయం (Denver University) నుండి సైకాలజీలో పీహెచ్‌డీ చేశారు. అతను బైబిలును అధ్యయనం చేసిన కొద్దీ, ఇక తాను క్రైస్తవ బోధలను అంగీకరించలేనని గ్రహించాడు మరియు (సువార్తలలోని ఎక్కువ భాగం) నిజం కాదని తాను గుర్తించిన తరువాత, దానిని బోధించేందుకు ప్రజల ముందుకు మాటిమాటికీ తిరిగి వెళ్లడానికి మరింత భయపడ్డాడు. అతను తన ప్రశ్నలను తాను గౌరవించే ఇతర క్రైస్తవ గురువుల వద్ద ప్రస్తావించినప్పుడు, వారిలో కొందరు (ఏకాంతంలో) అతనితో ఏకీభవించారు మరియు అతని పరిశోధనలతో అంగీకరించారు, కాని వారు తమ కుటుంబాలను విచ్ఛిన్నం చేయకుండా ఉండేందుకు మరియు తమ జీవనోపాధిని కోల్పోకుండా ఉండేందుకు తమ మతాన్ని విడిచిపెట్టి, సత్యాన్ని ప్రకటించలేమని పలికారు. డాక్టర్ డిర్క్స్, తన భార్య డెబ్రాతో కలిసి, నిజానికి ఇస్లాం ధర్మం మాత్రమే జీసస్ (అ) మరియు ఇతర దైవప్రవక్తలు తీసుకువచ్చిన సందేశాన్ని అనుసరించిన ధర్మమని గ్రహించారు. మరిన్ని వివరాల కొరకు ఈ క్రింది వెబ్సైటు సందర్శించండి.

http://www.jeralddirksanddebradirks.com/

**యుషా (జాషువా) ఎవాన్స్ (Yusha (Joshua) Evans)** దక్షిణ అమెరికాలోని ఒక బైబిల్ కాలేజీలో హాజరయ్యేవాడు, హిబ్రూ మరియు గ్రీకు భాషలలో బైబిల్ చదవడం నేర్చుకుని, క్రైస్తవ మిషనరీ లేదా గురువుగా మారాలనే సంకల్పం చేసుకున్నాడు. సువార్తను పూర్తిగా అంటే దాని తొలి అక్షరం నుండి చివరి అక్షరం వరకు ఆరు లేదా ఏడు సార్లు చదివిన తర్వాత, అందులో తాను గుర్తించిన తప్పులు మరియు అసమానతలను చూసి అతను స్వయంగా ఆశ్చర్యపోయాడు. ఇక అతడు క్రైస్తవ మతాన్ని విడిచిపెట్టి, సత్యాన్వేషణ ప్రారంభించాడు, కానీ అతను ఇస్లాం ధర్మాన్ని కనుగొనే వరకు ఏ మతమూ అతడిని సంతృప్తిపరచలేదు. అతడి గురించిన మరిన్ని వివరముల కొరకు ఈ వెబ్సైట్ సందర్శించండి. https://yushaevans.com/.

**అమీనా అస్సిల్మీ Aminah Assilmi** (మరణం. 2010, అల్లాహ్ ఆమెపై దయ జూపుగాక) గతంలో ఆమె ఒక అమెరికన్ బాప్టిస్ట్. తన తరగతిలో కొంతమంది అరబ్ ముస్లింలను చూసి, వారిని క్రైస్తవ మతంలోకి మార్చేందుకు ప్రయత్నం చేయాలని నిర్ణయించుకుంది. కానీ, ఆమె ప్రయత్నాలు విఫలం కాగా, వారి దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ చదివి, దానిలోని తప్పుల ద్వారా వారిని క్రైస్తవం వైపు ఆహ్వానించాలనే ఆలోచనతో, తనకు ఒక ఖుర్ఆన్ కాపీ ఇవ్వమని వారిని కోరింది. దాదాపు ఒకటిన్నర సంవత్సరాల ఖుర్ఆన్ పరిశోధన తర్వాత, తాను తలచిన దానికి భిన్నంగా అంటే వారిని క్రైస్తవులుగా మార్చే ప్రయత్నం విడిచి పెట్టి, సత్యాన్ని గ్రహించి ఆమె స్వయంగా తానే ఇస్లాం స్వీకరించింది. అల్లాహ్ ఆమెకు స్వర్గంలో ఉన్నత స్థానం ప్రసాదించుగాక!

**డాక్టర్ డేవిడ్ లైపెర్ట్ (Dr David Liepert)** కెనడియన్ అనస్థీషియాలజిస్ట్, అతడు తన ముస్లిం సహోద్యోగులకు వారు తప్పు చేస్తున్నారని మరియు క్రైస్తవ మతమే సత్యమని చూపించే ఉద్దేశ్యంతో ఇస్లాం ధర్మాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించాడు. అతడు బైబిల్ అధ్యయనం చేయడం ద్వారా మరియు తన స్వంత ప్రశ్నలకు సమాధానం వెదకడం ద్వారా దీనిని నిరూపించాలకి ప్రయత్నించాడు ... కానీ, అతడు తన నమ్మకాలను బలపరిచే సాక్ష్యాధారాలను సువార్తలలో కనుగొనలేకపోయాడు.

అతడి ఆత్మకథ Choosing Faith: Rediscovering the Commonalities Between Christianity & Islam అనే పుస్తకంలో వివరించబడింది మరియు అది ఇక్కడ ఆన్ లైన్లో అందుబాటులో ఉంది.

http://www.choosingfaith.com/

**ఇద్రిస్ తౌఫీక్ (Idris Tawfiq)** (మరణం. 2016, అల్లాహ్ అతనిపై దయ జూపుగాక). ఇది చాలామంది హృదయాలను తాకిన ఒక బ్రిటిష్ రచయిత మరియు మీడియా ప్రసారకుడి వృత్తాంతము. అతడు ఆంగ్ల భాష మరియు సాహిత్యంలో పట్టభద్రుడు. UK మరియు ఈజిప్ట్ రెండింటిలోనూ బోధించాడు. అతడు రోమ్‌లోని సెయింట్ థామస్ అక్వినాస్ యొక్క పాంటిఫికల్ యూనివర్సిటీ (Pontifical University of Saint Thomas Aquinas) నుండి సెక్రెడ్ థియాలజీ (Sacred Theology) లో డిగ్రీని కూడా పొందాడు; ఇస్లాం స్వీకరించడానికి ముందు, ఇద్రిస్ రోమన్ క్యాథలిక్ మతాచార్యుడు.

## ముస్లింగా మారడం ఎలా

ప్రతి మతానికి ఇతరులు అందులో చేరేటప్పుడు పాటించ వలసిన కొన్ని ప్రత్యేక నియమాలు ఉంటాయి.

ఉదాహరణకు ఎవరైనా యూదుడిగా మారాలనుకుంటే, ఈ క్రింది వాటన్నింటిపై వారు ప్రమాణం చేయ వలసి ఉంటుంది:

1) దేవుడు మరియు ఇశ్రాయేలు ప్రజల మధ్య 'శాశ్వతమైన ఒడంబడిక'లోకి ప్రవేశించడం మరియు యూదుడిగా మారడం అనేది అతని లేదా ఆమె స్వంత ఇష్టానుసారమై ఉండుట.;
2) అన్ని ఇతర మత విశ్వాసాలు మరియు ఆచారాలను విడిచి పెట్టి యూదమతాన్ని అంగీకరించుట అంటే జీసస్ (అలైహిస్సలామ్) మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ప్రవక్తత్వాన్ని తిరస్కరించుట మరియు వారి ద్వారా అల్లాహ్ మానవాళి కొరకు పంపిన దివ్యసందేశాల్ని తిరస్కరించుట;
3) ఎట్టి పరిస్థితుల్లోనూ యూదమతం పట్ల మరియు యూదు ప్రజల పట్ల అవిభక్త విధేయత చూపుట;
4) తోరా మరియు ఇతర యూదుల జ్ఞానాన్ని నేర్చుకోవడానికి కట్టుబడి ఉండుట; మరియు
5) అతడి లేదా ఆమె పిల్లలను యూదులుగా పెంచుట.

అలాగే, ఎవరైనా ఒక క్రైస్తవుడిగా మారాలంటే, క్రింది వాటిని పూర్తి చేయవలసి ఉంటుంది:

1) దేవుడికి ఒక భాగస్వామి, ఒక తల్లి మరియు ఒక కుమారుడు ఉన్నారని నమ్ముట;

2) అప్పుడే పుట్టిన ప్రతి బిడ్డా, నవజాత శిశువూ పాపాత్ముడేనని నమ్ముట;
3) దేవుడు మనిషిగా మారాడని మరియు ప్రజల పాపాల కోసం చనిపోవడానికి భూమి పైకి దిగివచ్చాడని నమ్ముట;
4) ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ప్రవక్తత్వాన్ని బహిరంగంగా తిరస్కరించుట; మరియు
5) ఖుర్ఆన్, మహోన్నతుడైన అల్లాహ్ నుండి అవతరించినది అనడాన్ని తిరస్కరించుట.

పై వాటితో పోల్చితే, ముస్లింగా మారడం చాలా సులభం. దాని కొరకు ముస్లింగా మారాలనుకునే వ్యక్తి కేవలం క్రింది వాటిని మాత్రమే పూర్తి చేయవలసి ఉన్నది.:

1) అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన దేవుడు ఎవ్వడూ లేడని సాక్ష్యమిచ్చుట(మరో మాటలో చెప్పాలంటే, అసత్య దైవాలన్నింటినీ తిరస్కరించుట),
2) ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త అని సాక్ష్యమిచ్చుట,
3) విశ్వాసం యొక్క మొత్తం ఆరు మూలాంశాలను (అర్కాన్ అల్ ఈమాన్ లను) విశ్వసించుట మరియు,
4) ప్రవక్త ముహమ్మద్(స) బోధించినట్లుగా అల్లాహ్ ను ఆరాధించుట.

అందువలన, ముస్లింగా మారడం అనేది చాలా సులభమైన, సరళమైన మరియు సాధారణమైన ప్రక్రియ. ఎవరికైనా ముస్లింగా మారాలనే నిజమైన కోరిక ఉంటే మరియు దైవం మన కొరకు ఎంచుకున్న నిజమైన మతం ఇస్లాం ధర్మము అని పూర్తిగా విశ్వసిస్తే, అతను లేదా ఆమె చేయవలసిందల్లా తన దైవవిశ్వాసానికి సాక్ష్యంగా 'షహదా' పలుకులను ఉచ్చరించడమే.

హృదయపూర్వకంగా ఈ సాక్ష్యాన్ని ఉచ్చరించడం ఏ వ్యక్తినైనా ఇస్లాం మతంలోకి మార్చి వేస్తుంది. ఇది ఇస్లాం ధర్మం యొక్క ప్రధాన సింహద్వారం.

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించినారు:

“ఎలాంటి భాగస్వాములు లేని అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన దేవుడు ఎవ్వడూ లేడని; ముహమ్మద్ అల్లాహ్ యొక్క దాసుడు మరియు ఆయన ప్రవక్త అనీ; యేసు అల్లాహ్ యొక్క దాసుడు మరియు ఆయన ప్రవక్త అనీ, అతడు మేరీకి ప్రసాదించబడిన ఆయన వాక్కు అనీ మరియు ఆయన నుండి సృష్టించబడిన ఆత్మ అనీ; స్వర్గం నిజమని; మరియు నరకం నిజమనీ సాక్ష్యమిచ్చేవాడిని - అల్లాహ్ అతడి పనుల ప్రకారం చివరికి స్వర్గంలోకి ప్రవేశపెడతాడు.”

(సహీహ్ అల్ బుఖారీ హదీథు గ్రంథము)

సాక్ష్యప్రకటన ‘షహాదా’ యొక్క మొదటి భాగం, అల్లాహ్ తన మహాప్రవక్తలకు వెల్లడించిన అత్యంత ముఖ్యమైన సత్యవచనాలు కలిగి ఉంది, "అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైన దేవుడు ఎవ్వడూ లేడు." ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు:

{మరియు మేము, నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా: "నిశ్చయంగా, నేను (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్యుడు లేడు! కావున మీరు నన్నే (అల్లాహ్ నే) ఆరాధించండి." అనే దివ్యజ్ఞానం (వహీ) ఇచ్చిపంపాము.}

*(ఖుర్ఆన్ 21: 25)*

ఈ సాక్ష్యప్రకటన కలిగి ఉండటం అంటే అన్నిరకాల ఆరాధనలు - ప్రార్థించడం, ఉపవాసం ఉండడం, వేడుకోవడం, శరణు కోరడం లేదా ఖుర్బానీ అంటే పశుబలి సమర్పించడం వంటివన్నీ - కేవలం అల్లాహ్ కు మాత్రమే చెందాలి మరియు ఆయన వైపునకు మాత్రమే మళ్లించబడాలి. అల్లాహ్ కు కాకుండా ఇతరులకు చేసే ఏ విధమైన ఆరాధన అయినా (దైవదూతలకు గానీ, ప్రవక్తలకు గానీ, జీసస్ (అ)కు గానీ, ముహమ్మద్ (స) కు గానీ,

బాబాలకు గానీ, గురువులకు గానీ, విగ్రహాలకు గానీ, శిల్పాలకు గానీ, సూర్యుడు, చంద్రుడు, చెట్లు, పుట్టలు, శిలువ మొదలైన వాటికి గానీ లేదా మరేదేని వైపునా గానీ) ఇస్లాం ధర్మానికే కాకుండా ప్రవక్తలందరి ప్రాథమిక సందేశానికి కూడా విరుద్ధంగా పరిగణించబడుతుంది; ఇది పరలోకంలో అస్సలు క్షమించబడని ఘోరాతి ఘోరమైన మహాపాపం, కాబట్టి మరణానికి ముందే మేల్కోవాలి, పశ్చాత్తాపపడాలి మరియు సకల లోకాల సృష్టికర్త, అంతిమ తీర్పుదిన యజమాని అయిన అల్లాహ్ వైపు మరలాలి. అప్పుడే మనం ఇహ పరలోకాలలో సాఫల్యవంతులము అవగలము.

సాక్ష్య ప్రకటన యొక్క రెండవ భాగం అంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్ యొక్క దాసుడు మరియు అల్లాహ్ ఎంచుకున్న ప్రవక్త[4] అని సాక్ష్యం పలకడం. ఒక నిజమైన ముస్లిం, హదీథు గ్రంథాలలో నమోదు చేయబడిన ప్రవక్త (స) ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటిస్తాడని ఇది సూచిస్తుంది. ఒక వ్యక్తి ఆయన (స) బోధించిన దానిని విశ్వసించాలి, ఆయన (స) బోధనలను ఆచరించాలి మరియు అతను నిషేధించిన వాటికి దూరంగా ఉండాలి, ఎందుకంటే హదీథులు కూడా వాస్తవానికి అల్లాహ్ ద్వారా ఆయన

ఇంతకు ముందు పేర్కొన్నట్లుగా, ప్రవక్త ముహమ్మద్ (స) ఖుర్ఆన్‌ను తన ప్రవచనాలు, ఆచరణలు మరియు ఆదేశాల ద్వారా, అలాగే తన జీవితంలోని ఇతర అంశాలన్నింటి ద్వారా ఆచరణాత్మక పద్ధతిలో అమలు చేయడానికి పంపబడ్డారు. ప్రజలు ఆయన (స) స్వభావం గురించి అడుగగా, ఆయన (స) భార్య ఆయిషా (రదియల్లాహు అన్హా) ఇలా జవాబిచ్చినారు:

« ఆయన స్వభావము ఖుర్ఆన్»

---

[4]. ఆరాధన యొక్క అసలు అర్థం - విశ్వాసంలో, సంకల్పంలో, మాటలలో మరియు చర్యలలో అల్లాహ్ యొక్క ఆజ్ఞలకు సంపూర్ణంగా విధేయత చూపుట మరియు సంపూర్ణంగా సమర్పించు కొనుట. ఇస్లాంలో 'అల్లాహ్ కు దాస్యం' అంటే ఇదే.

(ముస్లిం మరియు అబీ దావూద్ హదీథు గ్రంథాలు)

అందువలన, షహాదా సాక్ష్యప్రకటన రెండవ భాగానికి నిజంగా కట్టుబడి ఉండటం అంటే జీవితంలోని అన్ని రంగాలలో ఆయన (స) ఆదేశాలను అనుసరించడమే. దీని గురించి మహోన్నతుడైన అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు:

{(ఓ ముహమ్మద్!) ఇలా ప్రకటించు: "ఒకవేళ మీరు నిజంగా అల్లాహ్ ను ప్రేమించేవారే అయితే, నన్ను అనుసరించండి - అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్ అమితంగా క్షమించేవాడూ, అపారంగా కరుణించేవాడూనూ."} *(ఖుర్ఆన్ 3: 31)*

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అనుకరించేలా ఒక నిజమైన ముస్లిం తన జీవితాన్ని మరియు తన స్వభావాన్ని మార్చుకోవడానికి ప్రయత్నించాలి, ఎందుకంటే ఆయన (స) మానవులు అనుసరించడానికి సాటిలేని ఒక సజీవ ఉదాహరణ. అల్లాహ్ తన ప్రవక్తతో ఇలా పలికాడు:

{నిశ్చయంగా, నీవు ఉత్తమమైన శీలవంతుడవు!}*(ఖుర్ఆన్ 68:4)*

అల్లాహ్ ప్రజలందరితో ఇలా సంబోధించాడు:

{వాస్తవానికి, అల్లాహ్ యొక్క సందేశహరునిలో మీకు ఒక ఉత్తమమైన ఆదర్శం ఉంది, వారి కొరకు ఎవరైతే అల్లాహ్ మరియు అంతిమ దినాన్ని ఆశిస్తారో మరియు అల్లాహ్ ను అత్యధికంగా స్మరిస్తారో!} *(ఖుర్ఆన్ 33: 21)*

ఒకరు ఇస్లాంలో ప్రవేశించినప్పుడు అతను లేదా ఆమె, నిజానికి తన గత జీవితంలోని ఆచరణలు మరియు నమ్మకాల నుండి పశ్చాత్తాపపడినందు వలన, ఆ వ్యక్తి యొక్క మునుపటి పాపాలన్నీ క్షమించి వేయబడతాయి; ఒక వ్యక్తి సరైన భక్తి మరియు నీతితో కూడిన కొత్త జీవితాన్ని ప్రారంభిస్తాడు. అల్లాహ్ తన పూర్వ పాపాలను క్షమించే షరతుతో మాత్రమే ఇస్లాం స్వీకరిస్తానని పలికిన ఒక వ్యక్తితో ప్రవక్త (స) ఇలా ప్రశ్నించినారు:

«ఇస్లాం స్వీకరించడం వల్ల అంతకు ముందు జరిగిన పాపాలన్నీ క్షమించి వేయబడతాయనే విషయం నీకు తెలియదా?» (ముస్లిం హదీథు గ్రంథము)

ఒక వ్యక్తి ఇస్లాం స్వీకరించిన వెంటనే, తన పూర్వ పాపాలన్నింటి నుండి విముక్తి పొందుతాడు. అతడు లేదా ఆమె అప్పుడే జన్మించిన స్థితి వలే, అవన్నీ ఆ వ్యక్తి యొక్క రికార్డు నుండి తుడిచి వేయబడుతాయి. కాబట్టి ముస్లింగా మారిన క్షణం నుండి ప్రతి ఒకరూ తమ రికార్డులను శుభ్రంగా ఉంచుకోవడానికి శాయశక్తులా ప్రయత్నించాలి మరియు వీలైనన్ని మంచి పనులు చేయడానికి ప్రయత్నించాలి; ఎంత ఎక్కువ మంచి పనులు చేస్తే, అతడు లేదా ఆమె స్వర్గంలో అంత ఉన్నత స్థితికి చేరుకుంటారు.

ఇస్లాంను అంగీకరించడం అంటే మునుపటి ప్రవక్తల (అలైహిస్సలాం) సందేశాలను తిరస్కరించడం కాదని మరోసారి నొక్కి చెబుతున్నాము. నిజానికి, ఇది ఆ సందేశాలను నెరవేర్చుటయే. కాబట్టి, మీరు యూదుడు లేదా క్రైస్తవులైతే, ఇస్లాంను అంగీకరించడం మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ను అనుసరించడం అనేది మోసెస్ మరియు జీసస్ (అలైహిస్సలాం) తీసుకువచ్చిన సందేశాలను నెరవేర్చడమే.[5]

మరోవైపు, ఇస్లాంను తిరస్కరించడం అంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) నుండి మాత్రమే కాకుండా, ఇతర ప్రవక్తలైన మోసెస్ మరియు జీసస్ (అలైహిస్సలాం)ల నుండి కూడా వెనుదిరగడం అన్నమాట. అలా చేయడం వాస్తవానికి ఆ మహాప్రవక్తల సందేశాలను సూటీగా ఉల్లంఘించడమే అవుతుంది మరియు ఇది పరలోకంలో స్వర్గం పొందాలనే మీ ఆశలను అంతం చేస్తుంది.

భవిష్యత్తులో అంటే పరలోకంలో మీ స్వంత నివాసం ఎక్కడ ఉండాలనే నిర్ణయం ఇప్పుడు మీ చేతుల్లో ఉంది. మీకంతా మంచి జరగాలని ఆశిస్తున్నాను!

---

[5].ఇది మాజిద్ అల్-రస్సీ యొక్క *The Amazing Prophecies of Muhammad (bpuh) in the Bible: Twenty-Eight Proofs from the Bible of Muhammad's Prophethood*. అనే ఇంగ్లీషు పుస్తకంలో స్పష్టంగా నిరూపించబడింది.

## చివరి మాట

**ఇస్లాం మీ జన్మహక్కు. అవును, మీరు సరిగ్గానే చదివారు. ఇస్లాం మీ హక్కు.**

వాస్తవానికి, ప్రతి మానవుడు ఇస్లాం ధర్మంలోనే జన్మిస్తాడు. సహజంగా మానవులు ముందు నుండే తమకు తెలిసి ఉన్న వాటి వైపుకు ఆకర్షితులు అవుతారు. అందువలన, మీరు ఇస్లాం స్వీకరిస్తే, మీరు ఏదైనా పూర్వ సందేశం వైపు మరలుతున్నారని కాదు. దానికి భిన్నంగా, మీరు సృష్టించబడిన అసలు స్వచ్ఛమైన విశ్వాసం వైపు మీరు మరలుతున్నారు. కాబట్టి, ఇస్లాం మీ జన్మహక్కు అని ఇది నిరూపిస్తున్నది. అయితే సహజసిద్ధంగా మీరు సృష్టించబడిన, మీ జన్మ హక్కు అయిన స్వచ్ఛమైన విశ్వాసం నుండి మీరు వైదొలగాలని ఇతర మతపరమైన, సైద్ధాంతికపరమైన వ్యవస్థలు మిమ్ములను పిలుస్తూ, మీ ఇహపరలోకాలను నాశనం చేయటానికి ప్రయత్నిస్తున్నాయి. అల్లాహ్ మనల్ని అలాంటి వాటి ప్రభావం నుండి కాపాడు గాక!

# BIBLIOGRAPHY


Caraballo, Simon (Muhammad bin Abdullah Caraballo). *My Great Love for Jesus Led Me to Islam*. Jubail, KSA: Dawah & Guidance Centre.

Liepert, David. Choosing Faith. Riyadh: International Islamic Publishing House, 2011. (Available online at http://www.choosingfaith.com/.)

al-Rassi, Majed. *The Amazing Prophecies of Muhammad (bpuh) in the Bible: Twenty-Eight Proofs from the Bible of Muhammad's Prophethood*. http://www.saaid.net/The-clear-religion/06.pdf.

దివ్యఖుర్ఆన్ సందేశము: ఖుర్ఆన్ యొక్క తెలుగు భావానువాదం, కింగ్ ఫహద్ హోలీ ఖుర్ఆన్ ప్రింటింగ్ కాంప్లెక్సు.

# అనుబంధము

ఇది ఇంగ్లీషు పుస్తకం *Who Deserves to Be Worshipped?* *నుండి సంకలనం చేయబడింది*, మీ కొరకు ఇంగ్లీషులో అసలు కాపీ ఇక్కడ ఆన్ లైనులో ఉన్నది. http://www.saaid.net/The-clear-religion/017.pdf.

ఇంగ్లీషులో అందుబాటులో ఉన్న ఇలాంటి ఇతర రచనల పట్టిక క్రింద పేర్కొనబడింది:

1. *What Is the Purpose of Creation?*
   http://www.saaid.net/The-clear-religion/028.pdf.

2. *The Beautiful Teachings of Islam*.
   http://www.saaid.net/The-clear-religion/029.pdf.

3. *Eleven Facts about Jesus and His Mother (Mary) in the Islamic Teachings*.
   http://www.saaid.net/The-clear-religion/04.pdf.

4. *Is Original Sin a Fact?*
   http://www.saaid.net/The-clear-religion/030.pdf.

5. *The Amazing Prophecies of Muhammad (bpuh) in the Bible: Twenty-Eight Proofs from the Bible of Muhammad's Prophethood*.
   http://www.saaid.net/The-clear-religion/06.pdf.

6. *Islam's Revival of Jesus' Teachings*.
   http://www.saaid.net/The-clear-religion/05.pdf.

7. *Is the Bible the Word of God?*
   http://www.saaid.net/The-clear-religion/031.pdf.

**ఇంగ్లీషులో ఇస్లాం గురించి మరింత సమాచారం కోసం,**


- Ata ur-Rahim, Muhammad and Ahmad Thomson. *Jesus: Prophet of Islam*. Riyadh: International Islamic Publishing House, 2008.
- Baagil, M. *Christian-Muslim Dialogue*. Riyadh: International Islamic Publishing House.
- Bucaille, Maurice. The Quran and Modern Science. Riyadh: International Islamic Publishing House, 2001.
- Ibrahim, I. A. A Brief Illustrated Guide to Understanding Islam. Houston, TX: Darussalam, 1997. (Available at www.islam-guide.com.)
- Khan, Maulana Wahiduddin. *God Arises*. Riyadh: International Islamic Publishing House, 2005.
- Khan, Abdul Waheed. *The Personality of Allah's Last Messenger*, 2nd ed. Riyadh: International Islamic Publishing House, 2007.
- LeBlanc, Abdul-Malik. *The Bible Led Me to Islam.* Toronto: Al-Attique Publisher.


**ఇస్లాం గురించి ఆన్‌లైన్ సమాచారం కోసం,**

- osoulstore.com/
- islam-guide.com
- iera.org
- islamtomorrow.com
- discoveritsbeauty.com
- edialogue.org (live chat)
- islamhouse.com/en/ (thousands of free books)
- iera.org/shop/ (free downloads)
- iiph.com

# ఇస్లామీయ పదాల నిఘంటువు[6]

| | |
|---|---|
| *అబూ* (అబీ) | తండ్రి |
| హదీథు | హదీథు గ్రంథాలలో నమోదు చేయబడిన ప్రవక్త ముహమ్మద్ (స) యొక్క ప్రవచనం లేదా ఆచరణ. ఇలా నమోదు చేయడంలో ఆయన (స) నుండి గ్రంథకర్త వరకు ఆయన (స) సహచరులు మరియు అనుచరుల ఖచ్చితమైన ఉల్లేఖన పరంపర అవిచ్ఛన్నంగా, ప్రామాణికంగా ఉంటుంది. |
| హజ్ | మక్కా నగరంలో ఉన్న కాబా గృహంలోని పవిత్ర మస్జిదుకు చేసే ప్రధాన యాత్ర, ప్రతి సమర్థుడైన ముస్లిం తన జీవితకాలంలో కనీసం ఒకసారి చేపట్టాలి. |
| హిజాబ్ | విశ్వాసులైన స్త్రీల కోసం అల్లాహ్ నియమించిన పరదా. |
| కాబా | అల్లాహ్ గృహము. ఇది మక్కాలో ఉన్నది, అసలు దానిని ప్రవక్త అబ్రహాం మరియు ఇష్మాయీల్ నిర్మించారు |
| రమదాన్ | ఇస్లామీయ క్యాలెండరులోని తొమ్మిదవ నెల; విధిగా నెలంతా ఉపవాసం ఉండాలి. |
| జకాతు | ముస్లింలు తప్పనిసరిగా చెల్లించ వలసిన విధి దానం, జకాతు తీసుకునే అర్హత గల నిరుపేదలలో దీనిని పంచి పెడతారు. |

6 తెలుగు భాషలోని పదాలే (అనగా, ప్రామాణిక తెలుగు బాషా నిఘంటువులలో పేర్కొనబడిన పదాలే), ఈ అనువాదంలో కూడా ఉపయోగించబడినాయి.